# పుడింగి

8



రైలు బిట్రగుంట దాటగానే టి.సి. సుజిని గుర్తించాడు. టి.సి. రైలు దిగి వెళ్ళిపోయాడేమోనని టాయిలెట్‌లోంచి ఆమె తొంగి చూస్తూ పట్టుబడిపోయింది.

"టికెట్టేది?" టి.సి. సుజిని ఎగాదిగా చూస్తూ గద్దించాడు.

సుజి అలవాటు ప్రకారం గొల్లున ఏడుస్తూ దబ్బున కింద కూలబడింది. అమాంతం ఆయన కాళ్ళను వాటేసుకుంది.

టి.సి. ఆమెను చూస్తూ అసహనంగా కదిలాడు.

నాలుగడుగుల ఎత్తు మనిషి, ఆరునెలల ఎత్తు కడుపు, పాలిపోయిన చివర్లు చిట్లిన పెదాలు, పోషకాహార లోపంతో వచ్చిన నల్లటి, తెల్లటి మచ్చలతో నిండిన ముఖం, పొట్టిలంగా. వేళ్ళాడుతోన్న పయిట, మెడనిండా పూసల దండలు, పొట్టి జుట్టుకు కట్టిన ఎర్ర రబ్బను, జుట్టులోకి దోపిన రంగురంగుల పిన్నులు.

సుజి గోలగోలగా ఏడుస్తూనే వుంది. అప్పుడప్పుడు తన పొడికళ్ళతో ఓరకంట అతని ముఖకవళికల్ని పరిశీలిస్తూనే వుంది.

టి.సి. కంగారు అణుచుకుంటూ, కాళ్ళు విదుల్చుకుంటూ వెనక్కు జరిగాడు.

ఆమెను పట్టుకున్నా పట్టుమని పదిపైసలు రాలవని అతనికి ఖచ్చితంగా తెలుసు.

"వచ్చే స్టేషన్‌లో దిగిపో!"

టి.సి. తన గౌరవాన్ని నిలుపుకుంటూ వేగంగా వెళ్ళిపోయాడు.

వచ్చే స్టేషనే సుజి దిగాల్సింది!

సుజి విజయోత్సాహంతో కాళ్ళు బార్లా జాపుకుని కక్కసు[1] తలుపు దగ్గరే కూలబడింది. చిరిగిన చీరతో కట్టిన మూటని దగ్గరకి లాక్కుంది.

సుజి బెనారస్ నుంచీ ఇలాగే వస్తోంది. టిక్కెట్లు లేకుండా దింపిన చోట దిగేస్తూ మళ్ళీ ఎక్కుతూ, మళ్ళీ దిగుతూ చివరికి నెల్లూరు చేరుకుంది.

ఈ జిత్తులమారి తెలివి ఆమె జీవనంలోనే వుంది.

సుజి నక్కలోళ్ళ చిన్నది. పూసలమ్మి.

నిజానికి సుజి బనారస్ నుంచి వంటరిగా తిరిగిరావాలని అనుకోలేదు. మొదట బనారస్‌దాకా వెళ్ళాలనీ అనుకోలేదు. శివరాత్రినాడు బయలుదేరిన జట్టంతా ఒక్కో ఊరు దాటుతూ ఉత్సాహంగా బనారసు దాకా వెళ్లిపోయారు. వారితోపాటే కావల్‌కార్... సుజి...

1. టాయిలెట్

బనారసుకు బయలుదేరేప్పటికే కడుపులో నలుసు పడ్డ సంగతి తెలుసు. అంతకుముందు అయిదుసార్లు చేసినట్లే ఆ మారు ఎలాగోలా పురుడు పోసుకోవచ్చుననుకుంది.

సుజికి ఆసుపత్రులన్నా సూదులు, మందులన్నా చచ్చేంత భయం. ఆ భయం ఎప్పుడు మొదలయ్యిందో కానీ ఒకే ఒక్కసారి సూది వేయించుకున్నది జ్ఞాపకం.

సుజి తన చేతిమీద టీకామచ్చను తడుముకుంది.

ఆ రోజు గాలీవాన. నక్కలోళ్ళంతా పరుగుపరుగున కలెక్టర్ బంగ్లా దగ్గరకు చేరారు.

వాన తగ్గుముఖం పెట్టగానే తెల్లవ్యానులో, తెల్లకోట్లు వేసుకున్న డాక్టరయ్యలు, డాక్టరమ్మలు తెల్లచీరల నర్సమ్మలు బిలబిలమంటూ వచ్చారు వారి దగ్గరకు.

పిల్లా పెద్దా చిన్నా చితుకు అందర్నీ ఓ లైనులో నిలబెట్టారు.

రొట్టు మిట్లు[1] అన్నం మిన్నం[2] పెడతారనుకున్నారు నక్కలోళ్ళంతా.

మొదటి నలుగురైదుగురుకి సూదులు గుచ్చగానే వ్యవహారం అర్థమైపోయింది.

పారిపోతున్న వాళ్ళని పట్టుకొని మరీ కసుక్కు కసుక్కుమని గుచ్చిపారేస్తున్నారు.

సుజి గింజుకుంటూ తనను పట్టుకొచ్చినవాడిని పళ్ళతో కొరకబోతోంటే - లావాటి నర్సమ్మ సుజి వీపు మీద రెండు అంటించింది. చిన్న పిల్లని కూడా చూడకుండా.

సుజి కాళ్ళను నేలమీద కొడుతూ బ్యార్‌బ్యార్‌మంటూ గొంతుచించుకుని అరిచింది.

లావాటి నర్సమ్మ, నల్లటి కాంపౌండరు చెరో జబ్బ బిగించి పట్టుకొని చరచరా లాక్కెళ్ళారు. అమాంతం ఎత్తి ఓ కాలువిరిగిన స్టూలుమీద ఎత్తికుదేసి బిగించి పట్టుకొన్నారు.

సుజి గిజగిజలాడుతోంటే స్టూలు అటుఇటూ కదులతూనే వుంది. నిజానికి వెచ్చని సూదిని వాళ్ళు ఎప్పుడు తన జబ్బలో గుచ్చారో సుజి గమనించనే లేదు.

నర్సమ్మ స్టూలు మీద నుంచి నెట్టినంత పనిచేసేసరికి లోకంలో పడింది.

అటూ ఇటూ చూసి మళ్ళీ కెవ్వుమంది. రెండురోజులు చెయ్యి ఇంతెత్తు వాచి తగ్గినా... జ్వరాన పడి తగ్గినా... సుజికి ఆ దడుపు తగ్గలేదు.

కిరసనాయిల్ స్టవ్వుల మంటలు, కుతకుత ఉడుకుతోన్న సూదులు, స్పిరిట్‌లో ముంచిన దూది ఉండలు ఎన్నేళ్ళ నాటి సంగతయినా ! సుజి కళ్ళముందు కదులుతూనే వున్నాయి. ఎన్నేళ్ళ నాటి సంగతులయినా! వాసన తలుచుకోగానే వాంతి వచ్చేస్తోంది. సుజి గుండె మళ్ళీ దడదడమంది.

సుజి తల బరబరా గోక్కుంటూ రైలు బయటకు చూసింది. ఇక్కడా వానలు బాగానే పడ్డట్టుగా వున్నాయి. అక్కడక్కడా గుంటల్లో బురద నీరు నిలిచివుంది.

రైలు పెన్నానది దాటింది. ఏట్లో ఇసుక మేటలే. ఓ పక్కగా సన్ననిపాయ - ఏరు పారేంత వర్షాలు లేవన్నమాట.

---

1,2. నక్కలోళ్ళ పలుకుబళ్ళు

రైలు కీచుమంటూ స్టేషన్‌లో ఆగింది.

సుజి రైలు దిగి హాయిగా గాలిపీల్చుకుంది. పట్టాల మీద మహారాణిలా విలాసంగా నడుచుకుంటూ బోసుబొమ్మ వద్దనున్న తమ వారిని కలిసింది.

వానలు పడుతున్నట్టున్నాయి. అంతా చిత్తడి చిత్తడిగా వుంది. సన్నగా చినుకులు పడుతున్నాయి. ఆగిఆగి.

రైలు కట్ట పక్కన బురద మట్టిలో పిల్లలు దొర్లుతున్నారు. సుజి తిన్నగా వాళ్ళ దగ్గరకి వెళ్ళింది. ఏ ఒక్కరికో ఇద్దరికో తప్ప వంటిమీద గుడ్డలేవు. బురదే బట్టలూ, నగలూ అన్నీను. మెళ్ళో పూసల దండల బట్టి నక్కలోళ్ళ పిల్లలనుకోవచ్చు.

పిల్లలు కొందరు నీళ్ళల్లో చిందులేస్తుంటే కొందరు బురదలో స్నానాలు చేస్తున్నారు. వాళ్ళల్లో నగ్మా కోసం వెతికింది సుజి.

నగ్మా పక్కగా కూచోని సన్నపుల్లతో నేలను కెలుకుతోంది. ఓ వానపాము మెల్లగా పైకి వచ్చింది. నగ్మా దాన్ని పుల్లతో పొడిచింది. అది కదలకుండా పడిఉంది. నగ్మా దాన్ని చేతిలోకి తీసుకుని దాన్ని పుల్లతో అటు ఇటు పొర్లించి చూసింది. చటుక్కున నోట్లో వేసుకుంది.

సుజి గబగబ నగ్మా దగ్గరికి వెళ్ళి నగ్మా పిర్రమీద రెండంటించింది. చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళింది. నగ్మా ఏడుపు లంకించుకుంది.

దబాబాయి గొడుగేసుకుని వాన తగ్గాక వచ్చే బేరాలకోసం చూస్తోంది. సుజి వాన చినుకులో నగ్మాని వీధికుళాయి దగ్గరకి తీసికెళ్ళి కూలేసింది.

వంటిమీద బురద కరిగిపోయి నగ్మా అవతారం బయటపడింది.

ఐదేళ్ళపిల్ల. రెండేళ్ళపిల్లలా వుండి. పెద్దపొట్ట, ఊచల్లాంటి కాళ్ళూ చేతులు, తేలిపోతున్నట్లు కళ్ళు. వానలకి అంతా బురద బురదగా ఉంది. మురుగు నీళ్ళు బురద నీళ్ళలో కలిసిపారుతున్నాయి. సుజి తన పయిటతో నగ్మాను తుడిచింది. మూటల్లోంచి ఓ పాత గౌను తీసి నగ్మాకు తొడిగింది. మూటల్లోంచే పిండి, పంచదార కలిపి చేసిన ఉండల్ని తీసి నగ్మా చేతిలో పోసింది. ఓ రబ్బరు బూర దాని చేతికిచ్చింది.

నగ్మా చటుక్కున ఏడుపాపింది. నగ్మా ఆ పంచదార గోళీలను చప్పరిస్తూ బూర ఊదాలని ప్రయత్నిస్తూ తన స్నేహితుల దగ్గరకు పోయింది.

సుజి ఆయాసపడుతూ ఓ డేరా కింద మెరక మీద కూలబడింది. వానకి తడిచి అదీ అద్వాన్నంగా వుంది. ఒక్కోరు వచ్చి సుజిని పలకరిస్తున్నారు. ఎవరో ఓ గ్లాసెడు సారాయి తెచ్చిచ్చారు. సుజి పిల్లల వంక చూస్తూ సారాయి చప్పరిస్తూ నగ్మాను కేకేసింది. పిల్లలంతా బిలబిలమంటూ వచ్చారు. పిల్లలందిరికీ తలా కాసిని పంచదార ఉండలు చేతిలో పోసింది.

నగ్మా తల్లి చేతిలోని గ్లాసుని లాక్కోని చప్పరించింది. మిగిలిన పిల్లలతోపాటు పరిగెత్తింది.

సుజి కూడా ఈ పిల్లల్లాగే అయిదేళ్ళు వచ్చిందాకా వంటి మీద సరైన గుడ్డలేకుండా ఏవో రెండు పూసల దండలేసుకుని మట్టిలో పొర్లుతూ పెరిగింది.

కావల్‌కర్ కూడా ఆమెతోనే ఆడుతూండేవాడు. ఆడుతూ ఆడుతూ కాలవల్లో, చెత్తకుప్పల్లో తిండి కోసం వెతుకుతూ ఉండేవారు.

ఎనిమిదేళ్ళ పిల్లపుడు సుజి నాగరీకుల దృష్టిలో ఐదేళ్ళపిల్లలా వుండేది. అప్పుడు ఆమె తల్లి నెల్లూరుబాయి తన పాతపావడాని పైకి కుట్టేసి సుజి నడుముకి కట్టింది. పదేళ్ళ పిల్లపుడు జాకెట్టు పన్నెండేళ్ళ పిల్లపుడు పైట అమిరాయి.

ముక్కు రెండుపక్కలా గిల్టు నత్తులు. చెవులకు గిల్టు కమ్మలు.

మెడలో రంగురంగుల పూసల దండలు చేతులకు గాజులు వేసుకుని "అట్ట"[1] తీసుకుంది.

నెల్లూరుబాయి ఒకపాత చీరని జోలెలా కట్టింది అడుక్కోవడానికి.

"ఎవ్వురైనా సంసారీవోల్లు[2] కిండలు[3]చేచ్చే – ఆగిత్తం[4]సేయి – రచ్చసేయి[5] – "నెల్లూరుబాయి కూతురికి వ్యవహార రహస్యం చెప్పింది.

బుజ్జి ఉడుతని భుజాన ఎక్కించుకుని సుజి అమ్మకానికి బయలుదేరితే పెళ్ళికాని నక్కలోళ్ళ యువకులంతా కళ్ళు టపటపలాడించేవారు.

సుజి అంటే ఎతిరాజాకి అందరికన్నా ఒక్కరవ్వ ఎక్కువే మోజు.

ఎతిరాజా నక్కలోళ్ళ పెద్ద నెల్లనేరం కొడుకు.

తండ్రిలాగే పిట్టల్ని, జంతువుల్ని వేటాడ్డంలో మహా దుడుకు.

ఆత్మకూరు బస్టాండు వైపు నుండి రైలు కట్ట దాటి అటూ ఇటూ తిరిగేవాళ్ళు ఎవరైనా వంటరిగా దొరికితే వాడి అదృష్టమే.

అమాంతం వెళ్ళి వాళ్ళ ముఖాల్లో ముఖం పెట్టి భీకరంగా నవ్వేవాడు. అంతే – వాడి అవతారం చూసి పరారు అయినవాళ్ళు పరారు. కాని వాళ్ళు వణుకుతూ వాచీనో ఉంగరమో ఇచ్చి పరుగోపరుగు.

"థఫ్..." సుజి చిరాకుపడేది. "నక్కలోళ్ళలో సెడబుట్టినాడు.... ఎదవనీ.."

ఎతిరాజాకి సుజి అంటే భలే మోజు. ఎతిరాజా సుజి ఏ వీధిలో అమ్మకానికి పోతే ఆ వీధిలో ఏ సందులో అడుక్కోవడానికి పోతే ఆ సందులో ప్రత్యక్షం అయ్యేవాడు.

వాడు ఒక ముంగీసను పెంచుకుంటున్నాడు.

సుజి ఉడుతమీదికి, ముంగీసని ఉసిగొల్పేవాడు.

సుజికి వాడి దుడుకంటే వళ్ళుమంట.

సుజి పసిపిల్లప్పటి నుంచీ కావల్‌కార్‌నే పెళ్ళాడాలని.

కావల్‌కార్ సుజికి స్వయాన మేనమామ.

---

1. నక్కలోళ్ళు అమ్మే వస్తువులన్నీ ఓ కొయ్య అట్టమీద అమర్చుకుని తాడుతో మెడలో తగిలించుకుంటారు.
2. నక్కలోళ్ళు తప్పించి మిగిలిన సామాజికులంతా 3 హేళన చేయడం 4. గోలగోలచేయి 5. గొడవ

మంగళూర్‌సింగు, దబాబాయిల పెద్దకూతురు నెల్లూరుబాయి.

దబాబాయికి నెల్లూరుబాయి తర్వాత ముగ్గురు పిల్లలు పుట్టిపోయారు పురిట్లోనే. తరువాత తడాబాయి ఆ తరువాత కావల్‌కార్.

సుజి తండ్రి టేసస్‌సింగు. అతని తల్లి అతన్ని ఏ స్టేషన్‌లో కన్నదో కానీ అతను దక్షిణాదికిపోతూ నెల్లూరు స్టేషన్‌లో బండి దిగేసాడు.

అంతే, నెల్లూరుబాయిని చూసిన వేళా విశేషం – తన దగ్గరున్న అయిదువందలు మంగుళూరుసింగుకి చెల్లించుకుని, రెండు మేకపోతుల్ని[1] ఊరుగిరావతమ్మ[2]కు, మూడురోజులపాటు కల్లుముంతల్ని నక్కలోళ్ళకి చెల్లించుకుని – ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. టేసస్‌సింగ్ చేతిలో డబ్బులు కాస్తా అయిపోయాయి. దబాబాయ్ వాళ్ళ దేరా పక్కనే దేరా వేసేసాడు.

అప్పటికి నెల్లూరుబాయికి పద్నాలుగేళ్ళు. పదిహేనో ఏడు నిండేసరికి సుజికి తల్లి అయ్యింది. చక్కనైన సుజి ముక్కుమొహం చూసి పెద్దదయ్యాక ఎంత కట్నం అడగాలో తల్లీదండ్రి లెక్కలు వేసుకునేవారు.

దబాబాయి గుండె చెరువైపోయేది వింటున్నపుడల్లా ఆమెకి ఇంక ఒక్కటే కూతురు. తడాబాయి. ఈమె నెల్లూరుబాయి అంత చక్కటిది కాదు. అందరి ఆడవాళ్ళలాగే నాలుగడుగుల ఎత్తు అయితే ఎదిగింది కానీ బొంగుపుల్ల ఆకారమే. దబ్బపెదాలతో చింకి కళ్ళతో ఆకర్షణీయంగా వుండేదికాదు.

దబాబాయి ఎక్కువ కట్నం ఇవ్వగలిగే అల్లుడిని పంపమని రోజూ తమ దేవత ఊరుగిరావతమ్మకి మొక్కులు మొక్కేది.

ఆమె మొరలు విని కట్నం తెచ్చే అల్లుడు ఉరుకులు పరుగులు పెడుతూ రాలేదుకానీ సవితి వచ్చి ఆమె నెత్తినెక్కి కూర్చుంది.

ఆ వచ్చిన సవతి పరాయిదెవరైనా అయితే దబాబాయికి పెద్ద లెక్కలోకి వచ్చేది కాదు. జలకన్ని స్వయాన ఆమె చెల్లెలు. మొగుడితోపాటు కలకత్తా వైపు వ్యాపారానికి పోయిన ఆమె వంటరిగా తిరిగి వచ్చింది. వగలూ వుంది. వయ్యారమూవుంది. దానితో ఆరుకానుపులు అయిన తను సాపత్యం కాగలదా? లేనేలేదు.

ముసలి నక్కలాంటి తన ఇంటాయన్ని చిత్తులతో జలకన్ని వల్లో వేసుకుందని దబాబాయి గిలగిలలాడిపోయింది.

పోట్లగిత్తలా చెల్లెలిమీదికి తగువుకి వెళ్ళింది. ఒక కల్లుముంతంతా తాగేసి ఇద్దరు ఒకరిమీదికి ఒకరు లంఘించారు.

జుట్టుపట్టి కొట్టుకున్నారు. రక్కుకున్నారు. పీక్కున్నారు. కొరుక్కున్నారు. గిచ్చుకున్నారు.

---

1. దేవతకు బలి ఇచ్చే జంతువును బట్టి నక్కలోళ్ళలో కులాలు వున్నాయి. మేకలు బలి ఇస్తే – బోంగ్దావాలే ; కోళ్ళు బలి ఇస్తే – ముర్గావాలే ; దున్నపోతునైతే – వైరాగివోల్లు... ఇలా... 2. నక్కలోళ్ళ కులదేవత

గీరుకున్నారు. కట్టుకున్న పొట్టిలంగాలు పీలికలై వేలాడాయి. జాకెట్లు చిరిగిపోయాయి. పూసలదండలు తెగిపోయాయి.

అయినా ఎవరూ సవతుల మధ్య తలదూర్చలేదు.

చుట్టూ చేరి వినోదం చూస్తున్నారు ఎప్పటిలానే.

సుజి కూడా ఈ భీకర సంగ్రామాన్ని చూడనే లేదు.

నాలుగు గుంజల మీద చిరిగిన దేరా గుడ్డతో కప్పేసిన ఇంటిలో ఈ గుంజకు ఆ గుంజకు కట్టిన పాతచీరల్లో బట్టల్లేకుండా పడిడింది. ఈ గొడవ చెవినబడో మరెందుకో అప్పుడప్పుడూ తన పసిగొంతుతో కీచుమంటూ.

నెల్లూరుబాయి కొద్దిసేపు తల్లికి పినతల్లికి మధ్య సంధికి ప్రయత్నిస్తూ కొద్దిసేపు సుజికి స్తన్యమిస్తూ అటూ ఇటూ హడావుడి పడింది.

మంగళూరుసింగు ఏమీ పట్టనట్లు నింపాదిగా బీడి కాల్చుకుంటూ గుంజకు ఆనుకుని జోగుతూ ఉన్నాడు. అప్పుడప్పుడు తుపుక్కున పక్కకు ఉమ్మేస్తున్నాడు.

దబాబాయి. జలకన్ని మట్టిలో పొర్లుతూ కాళ్ళతో తన్నుకుంటూ మెలికలు తిరుగుతూ వస్తాదుల్లా కొట్టుకుంటున్నారు.

"యాందమ్మో.... ఇంగ జాల్లే... లేవండి లేవండి... ఆవంతన[1] తన్నుకుంటుండారే... మనుచులా ఏంది... లే... లే... అమ్మే.... లేయి..."

ఇద్దర్నీ చనువుగా లేపి చెరోపక్కా విసిరేసాడు నెల్లనేరం.

"పోండి రేయ్... ఎదవ నాయాల్లారా.... ఏందయ్యో.... చిన్మాగాని చూత్తున్నారా.... పుడింగి నాయాల్లారా.... పోండి.... పోయి యాపానాలు చేసుకోండి..."అందర్నీ చెదర గొట్టేసాడు.

"ఏందిమ్మే... ఏంది... సెప్పు... ఇనుకుంత..." మొదట దబాబాయినే అడిగాడు నెల్లనేరం.

"అన్నో... నువ్వే చెప్పు... నా ఇంటాయన ముస్లినక్క. ఆ కిలాడి నాకీ ఇంటాయన ఎంట ఎందుకుపడాల? నా కాప్రం[2]లో దాన్కి ఎందుకుపని?"

"జలకన్నికి మనసయ్యింది తల్లే... మంగుళూరుసింగుకు మనసయ్యింది..."

"ఏందన్నో... అట్టంటుండావేందె? దానొగలు చూసి నీ పని అయిందా. ఏందయ్యో..." దబాబాయి గొంతు చించుకుంది.

"పిల్కాయలు చెల్కాయలను సాకాలా... తినబెట్టాలా... తాపలా... పెండ్లిమిండ్లిసేయాలా.... ఆడుమనిచిని... నాకీ ఏమీ చేయాలా? పొన్నత్తమ్మో[3]".. దేవతని తలుచుకుంటూ గుండెలు బాదుకుంటూ నేలమీద కూలబడింది. గుప్పిళ్ళతో మన్ను తీసి గాల్లోకి విసిరేస్తూ ఏడుస్తోంది.

జలకన్నిని, మొగుణ్ణి తిట్టిపోస్తోంది.

జలకన్ని వీరావేశంతో ఎదురు తిడుతోంది.

---

1. ఆ విధంగా, అంతగా 2. కాపురం 3. సక్కలోళ్ళదేవత

నెల్లనేరం, అతని భార్య అంస ఇద్దరినీ సమాధానపరచడానికి ప్రయత్నిస్తున్నారు.

మంగళూరుసింగు తాపీగా లేచాడు, తన ఎడమవైపు బోదకాలును మెల్లిగా ఈడుస్తూ, నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి ఒక సోడా కొట్టించుకొచ్చాడు. జలకన్ని చేతికిచ్చాడు.

జలకన్ని పైకి లేచి పేలికలైన పావడాకు అంటిన దుమ్ము దులుపుకుంది.

ముఖాన కాస్త సోడా చిలకరించుకుంది. మిగిలిన సోడా నీళ్ళను గొంతులో పోసుకుని మంగళూరుసింగు పక్కన నిల్చుంది.

సవతి తిట్టినందుకు కాదు కానీ మొగుడు దానికి చేస్తోన్న సేవలు చూసి దబాబాయికి చిరచిరా మంటెత్తుకొచ్చింది. నోటి దురద తీరేదాకా తిడుతూనే వుంది. గుండెమంట ఆరేదాకా అరుస్తూనే వుంది.

ఇంతలో పిట్టలు పట్టుకోవడానికి వెళ్ళిన మగవాళ్ళు తిరిగివచ్చారు. పూసల అట్టలతో వెళ్ళిన ఆడవాళ్ళూ వచ్చేసారు.

ఆ సాయంకాలం అడుక్కు వచ్చిన సద్దికూడులో పాచినదాన్ని పారేసి మిగిలినదాన్ని కలేసుకుని తింటూ కల్లు తాగుతూ నక్కలోళ్ళంతా సవతుల పోరుగురించి వినోదంగా చెప్పుకున్నారు.

దబాబాయి ఈ గొడవలో పడి ఆ పూట అమ్మకానికి పోలేదు.

సవతి మీద కోపంతో చంటిబిడ్డను చంకలో వేసుకుని వేళగాని వేళ ఊరి మీదికి పోయింది. ఆమె తిరిగి వచ్చేసరికి తడాబాయిని తీసుకుని మంగుళూరుసింగు, జలకన్ని ఉడాయించారు. దబాబాయి కొడుకుని చూసి గుండె పగిలేట్టు ఏడ్చింది.

దబాబాయికి అనుమానం వచ్చి మూటలన్నీ వెతికింది. వాళ్ళు పోతూపోతూ సరుకు కూడా తీసికెళ్ళారు.

దబాబాయి గొల్లుమంది. ఆశ చావక స్టేషన్‌కు పరిగెత్తింది. దొంగలబండి ఎప్పుడో వెళ్ళిపోయింది. నెల్లనేరం ఆమెను వెతుకుతూ వచ్చాడు.

"అన్నో... హరాంజాదీ... లూట్‌కర్ గయిరే..." మళ్ళీ భోరుమంది "తడాబాయీ... నా యమ్మీ...."

"అమ్మే... యాడేడ తిరిగినా ఈడ్కి రావల్సిందే కాదా? శివ్రాత్తి ఎల్లింది అందరు ఎల్తుండాము కాదా? జుట్టుజట్టుగా ఉత్తరం తట్టు[1], దచ్చినం తట్టు యాడ కన్పట్టినా తడాబాయిని తోడ్కొని నీకు తెచ్చి ఇత్తా... పా..."

నెల్లనేరం పెళ్ళాం అంస ఆ రాత్రి దబాబాయికి రెండు ముంతలకల్లు ఉదారంగా అప్పు ఇచ్చింది. అంస మంచితనాన్ని తన బొంగరుగొంతుతో పొగుడుతూ పాడుతూ దబాబాయి ఇసుకమీద పొర్లుతూ వుంది రాత్రంతా.

అపుడే నెల్లూరుబాయి తన కూతురు సుజిని కావల్‌కార్‌కి ఇస్తానని తల్లికి మాటిచ్చింది. పెద్ద మనసుతో – కట్నం అటూ ఇటూ అయినా సరే సర్దుకుంటానని.

---

1. వైపు

ఈ వాగ్దానం జరిగినదెపుడో సుజికి తెలియదు. కావల్‌కార్‌కి తెలియదు. సుజి తండ్రి టేసన్‌సింగ్‌కు తెలియదు.

తెలియకుండానే సుజి చిన్నతనంలోనే కావల్‌కర్ పేరు చేతిమీద పచ్చబొట్టు పొడిపించుకుంది.వాడేం పొడిచాడో చదవడానికి అర్థం కాకపోయినా.

సుజి చుట్టూ చూసింది. దూరాన దబాబాయి ఇంకా బేరాల జోరులో ఉంది.

మళ్ళీ మబ్బు ముసుగేస్తోంది. చినుకులు పడొచ్చు.

సుజితో కబుర్లాపి ఒక్కోళ్ళు మూటముల్లె సర్దుతున్నారు. సుజి దబాబాయి పడేసి వెళ్ళిన మూటల్ని సర్దింది. నగ్మాను కేకేసి కాళ్ళు బార్లా జాపుకుకూచుంది.

దబాబాయి ముసలిదైపోలేదు. కానీ ఊళ్ళు తిరగడం లేదు. చాలాకాలం నుంచి ఇంటింటికి తిరగలేక బోసుబొమ్మ దగ్గరే ఓ గుడ్డపరిచి దాని మీద సామానుపరిచి అమ్ముకుంటోంది.

సుజి వచ్చేపోయే వాళ్ళను చూస్తూ కూర్చుంది.

ఈల శబ్దం వినిపించి తలఎత్తి చూసింది.

ఎతిరాజా.

సుజినే చూస్తున్నాడు. పై నుంచి కిందికి ఆబగా.

తెలుగు సినిమా బూతుపాట ఎత్తుకున్నాడు.

"వుల్టా నాయాలా[1]..." సుజి లంగా దులుపుకుంటూ లేచి నిలబడింది.

ఎతిరాజా జలకన్ని చిన్నకూతురు మ్రనాలినిని పెళ్ళి చేసుకున్నాడు.

ఆవడిలో మరో సంసారం వుందంటారు. ఎప్పుడు మద్రాసుపోయినా వాడో కొత్త విద్య నేర్చుకొస్తాడు.

"పిట్లు[2], పూస్లు[3] ఎవరు కొంతున్నారు? పూలచెట్టు చేద్దాం..." అన్నాడో రోజు నెల్లనేరం, అంస వెళ్ళి అందరికీ ప్లాస్టిక్ కాగితాలు తెచ్చిచ్చారు. కత్తెరతో కత్తిరించి, సన్నని చీకులకు చుట్టేయడమే. ఇది అందరికి తొందరగానే అబ్బింది. నాలుగు డబ్బులు మిగులుతున్నాయి. ఎతిరాజా నక్కలోళ్ళకి నాయకుడైపోయాడు.

ఇంకోసారి ఉడుతల్లో, ముంగిసల్లో గడ్డి కూరి బొమ్మల్లా తయారుచేసే కళ నేర్చుకొచ్చాడు. ఒక ఎతిరాజా తిరుగులేని నాయకుడై పోయాడు.

వాడు సుజి వెంటపడడం మాత్రం మానలేదు.

ఓ రోజు సుజి పెంపుడు ఉడుత మాయం అయ్యింది.

సుజి కంగారుగా వెతుకుతోంటే వెకిలిగా నవ్వుతూ ఎదురొచ్చాడు.

"ఏందమ్మే... ఎతకతా[4] వుండావ్....."

సుజి ముఖం తిప్పుకుంది.

---

1.తిట్టు 2. పిట్టలు 3. పూసలు 4. వెతుకుతూ

"దీనికోసవా...ఎట్టా...?" వాడు గడ్డికూరిన బుజ్జి ఉడుతని సుజి చేతిలో పెట్టాడు. సుజి కెవ్వుమంది.

ఎతిరాజా పగలబడి నవ్వాడు. ఇప్పుడూ నవ్వుతూనే వున్నాడు మెల్లిగా సుజివైపు వస్తూ సుజి మెల్లిగా కాళ్ళీడిస్తూ దబాబాయి దగ్గరికి వెళ్ళింది.

దబాబాయి బేరసారాల్లో మునిగి వుంది.

"ఆ బొంద్దారం పూసలివ్వు[1]"–

"పాలగిలక[2] లేదా?"

"సబ్బుపెట్టి ఇట్టా ఇయ్యమ్మే..."

"ఈర్వాన్ తీసుకో...."

"ఇదో.... ఈ తాయెత్తు నిజంగానే పన్జేస్తుందంటావా...?" రేకు తాయెత్తును పరిశీలిస్తూ అనుమానంగా అడుగుతోంది బేరమాడుతోందావిడ.

'పన్జేసే పనే అయితే చక్కదనాల చుక్కలు సుజి పిల్కాయలు బతకబళ్ళా...' మనసులో గొణుక్కుంది దబాబాయి.

పైకి సలాములు పెడుతూ అంది.

"అవంతన చెప్తున్నా. ఇనుకో తల్లే... మా దేవుత ఊరుగిరావతమ్మ సాయాన మాకిచ్చింది – ఇదుగో ఈ ఎలుగుబంటి ఎంటికలతాడుకు కట్టి మీ పనోడి మొలకి కట్టు – ఈ దిట్టిపూసలు మనికట్టుకు కట్టు. మా దేవుడు మీ బిడ్డను కనిపెట్టుకోనుంటాడే తల్లే..."

ఆమె మాట్లాడకుండా డబ్బులు తీసిచ్చింది. దబాబాయి సలాం చేసి ఆ డబ్బులు సుజికి ఇచ్చింది. సుజి టీ బంకు నుంచి టీ తెచ్చింది. టీ తాగుతూ నిట్టూర్చింది.

"నక్కలోళ్ళం మన్మూ సంసారోల్ల మాదిరి ఈ చుతారం తిండ్లూ ఎందుక్కు...?"

డబాబాయి టీ చప్పరించింది. "ముంద్రకాలం.... రైతులు, మారాజులు ఆ వంతన కయ్యల[3] మింద వొడ్లు పరిగలు[4] కొలుత్తూ వుండ్లా..." దబాబాయి గాల్లోకి మొక్కింది.

"నాగరీకం వచ్చిపళ్ళా... ఆమాన[5] ఈ నక్కలోళ్ళు సెడిపోతావుళ్ళా...." దబాబాయి గొణుక్కుంది.

"చిన్మా[6]నాగరీకం!"

నక్కలోళ్ళ గుంపుతోపాటు పల్లెల్లో తిరుగుతూ వుండేవారు.

దబాబాయి తండ్రి దగ్గర రవ్వల తుపాకీ వుండేది.

గురిచూసి కొట్టాడంటే ఎగిరే ఎగిరే పిట్ట గింగిరాలు కొడుతూ వచ్చినేలమీదపడేది. వల వేసాడంటే వట్టిచేతులతో వెనక్కి ఎన్నడూ రాలేదు.

సాయంత్రానికి అన్నింటిని వేసుకొని ఊళ్ళోకి వచ్చేవాడు. ఇంటింటికి తిరిగి పిట్టలు అమ్మేవాడు. కుందేళ్ళు, జెముడుకాకులు, చిలకలు, పావురాలు, ఒక్కోమారు, జింకపిల్లలూ – నక్కపిల్ల

1. మంగళసూత్రంలో వేసుకునే నల్ల, పగడపు పూసలు 2. కొయ్యగిలక 3. పొలాల
4. కల్లాం మిగిలిన ధాన్యం 5. ఆ విధంగా 6. సినిమా

దొరికితేనా - పండగే నక్కలోళ్ళకి.

దబాబాయి చేతికి ఆమె తల్లి అయిదో ఏటనే అట్ట ఇచ్చింది.

"సూదులోయ్... దబ్బనాలోయ్... రిబ్బిన్లు... కాటికబరిన్లు... చిల్కంచీసాలు...[1] నఖ్‌పాలీసు...[2] పిన్నీసులోయ్..." అని అరవడం నేర్పింది.

ఊరంతా తిరగేసి ఎండబడగానే ఊరిశివార్లలో వేసుకున్న గుడ్డగుడారానికి తిరిగొచ్చి.... అడుక్కొచ్చిన అన్నం, కూరల్ని కలేసి తలాకాస్త తినడం నేర్చుకుంది.

బియ్యం పప్పులు దొరికిన పూట చితుకులు ఏరుకొచ్చి నాలుగు మెతుకులు ఉడకేసుకోవడం నేర్చుకొంది.

పాసిపోయిన సద్దితోపాటు కల్లు తాగడం నేర్చుకొంది.

"ఇప్ప డబ్లు జాస్తిగా[3] వుండాయి. దర్లు జాస్తిగా వుండాయి. ఉప్పు... చింతపండు... మిరపకాయ... సమచ్చం అంగడికి పోవాల... ప్చ్... ముంద్రకాలం... కయ్యల మింద..."

దబాబాయి మళ్ళీ గాల్లోకి దండాలు పెట్టింది.

"ఓ అవ్వా... నీ కొడుకులకి నువ్వేపోయి కూడు ఉడకేసుకో... పో..." సుజి చేయి గాల్లోకి ఊపుతూ అంది. "బెనారసుకు"

"నువ్వేం చెప్పబళ్ళా..." దబాబాయి అదే ధోరణిలో అంది. "ఎల్లువాచ్చే[4] మాదిరిగా వుంది. గాలి తిరుక్కుంది.[5] యిల్లంతా చిల్లంపల్లం[6] అయిపోద్దేమో.... పా.... బిన్నే[7] పోదాం... ఆ టౌనుబస్సులో ఎక్కే పనికాదులే... అమ్మీ... లే..."

దబాబాయి, సుజి, నగ్మా మూటాముల్లె నెత్తినేసుకుని బయలుదేరారు.

సుజి గాంధీబొమ్మ సెంటరుదాకా చకాచకా నడిచింది. వి.ఆర్.సి సెంటర్‌దాకా నడిచేసరికి గగనమైపోయింది. కాళ్ళువాచి అడుగుపడడం లేదు. ఆయాసంతో రొప్పుతోంది. కళ్ళు తిరుగుతున్నాయి. ఇక మొరాయించి టౌనుబస్సుకోసం బస్సుషెడ్డులో కూలబడింది. దబాబాయి అప్పుడు చూసింది. సుజి కాళ్ళను ముఖాన్ని.

"అదేందమ్మే... ఆ మాదిరిగా వాపు చేసి ఉండాది. లే.అమ్మీ... జీబులాసుపత్రి[8] కి పోతాం." హడావుడి చేసింది దబాబాయి.

"నేన్రాను పోయే అవ్వా ఆస్పత్రికి... ఏందవ్వో... నువ్వు గూడ్క సుతారాలు. పోతుండావే... ఏనాడన్నా నువ్వు ఆచ్పత్రిముగం చూస్నా..." విలాసంగా నవ్వుతూ అంది.

"నీకంతా పెడర్థవయితే[9] నాకేవేమ్మో..." దబాబాయి కోపంగా తల తిప్పుకుంది.

"రాయే అవ్వా... ఈడ కూసో... టౌను బస్సురాగానే ఎక్కిపోదాం..." సుజి అవ్వతో సరసంగా అంది. దబాబాయి కాసేపాగి ఆశచావక మళ్ళీ అంది.

"అమ్మీ... డబ్బులాచ్పత్రికి[10] తోడ్కాని పోతా రాయే... మొహం సూస్నా ఏమాదిరిగా

---

1. తిలకం సీసాలు 2. గోళ్ళరంగు 3. ఎక్కువగా 4. వెల్లువ 5. తిరిగింది 6. చిందరవందర 7. వెంటనే
8. జూబ్లీ హాస్పిటల్ (మెటర్నిటి హాస్పిటల్) 9. తలపొగరు 10. ప్రవేట్ ఆసుపత్రి

బెట్టబడుండాదో[1]..."

"పోయే... అవ్వా... నేను పోతుండా..." దిగ్గున లేచింది సుజి.

సుజి అయిదుసార్లు ఆసుపత్రిలో అడుగుపెట్టకుండానే పురుడుపోసుకుంది. కావల్‌కర్‌తో పెళ్ళయిన ఏడాదిలోగానే మొదటికానుపు.

నక్కలోళ్ళ ఆడోళ్ళంతా కలిసికట్టుగా పురుడుపోసారు. ఆడపిల్ల.

కావల్‌కార్, సుజి అంతకుముందురోజు కనకమహాల్‌లో చూసిన సిన్మా హీరోయిన్ పేరు పెట్టుకున్నారు నగ్మా అని.

మళ్ళీ ఏడాదికి రెండో కానుపు అపుడు సుజి కావల్‌కార్ విజయవాడలో వున్నారు.

ఆడపిల్ల పుడితే విజయశాంతి, మగ పిల్లాడయితే విజయకాంత్ అనుకున్నారు ముందే.

కృష్ణానది ఎగువరోడ్డు పక్కన తుప్పల్లో రెండోబిడ్డ పుట్టాడు.

విజయకాంత్‌కి కావల్‌కార్ సుజి బిడ్డ బొడ్డు కోయడానికి ఎలాంటి కత్తివాడాడో కానీ బిడ్డ బొడ్డు దగ్గర చీముగడ్డకట్టింది.

సుజి గత అనుభవంతో కావల్‌కార్ చేత జిల్లేడుపాలు తెప్పించి పిల్లాడి ముక్కుల్లో, చెవుల్లో పోసింది. గొంతులో పోసింది. సంధాకు[2] నలిపి నోట్లో వేసింది.

వంట్లో వేడి పుట్టడానికి ఇద్దరికీ సారాయి తాగించాడు కావల్‌కార్.

అయినా బిడ్డ బొడ్డు దగ్గర చీముగడ్డ పెరిగిపెరిగి విజయకాంత్ కళ్ళు మూసాడు.

విజయకాంత్‌ను కృష్ణానదిలో పడేసి నెల్లూరుకు వట్టి చేతుల్తో వచ్చారు.

నగ్మాకు తాగడానికి తల్లి దగ్గర మరో ఏడాది పాలు దొరికాయి.

మూడో బిడ్డ సంధి జ్వరంతో పోయింది. అప్పుడు దబాబాయి గుండెలు బాదుకుని ఏడ్చింది.

"తాయెత్తు లేదూ, గీయెత్తూ లేదూ" దబాబాయి నిర్లిప్తంగా అనుకుంది.

"సంధాకు చీటీ, దిష్టిపూసలే పస్జేస్తే చక్కదనాల చుక్క – ఆ బిడ్డ సచ్చిపోతుందా?"

మళ్ళీ ఏడు సుజి కానుపులో ఏ బిడ్డ పుట్టిందో చూసుకునే అవకాశమే లేకపోయింది.

పుడుతూనే బిడ్డ కన్నుమూసింది.

నెల్లూరుబాయి కొంతకాలం పిల్లలు పుట్టకుండా వుండేందుకు ఆకు నూరి తెచ్చించింది సుజికి.

అది వికటించిందో ఏమో కానీ సుజి అయిదోసారి మూడోనెలలోనే గర్భస్రావం అయ్యింది.

ఇపుడు ఆరవసారి సుజి గర్భంతో వుంది.

అన్నిసార్లు సుజి ఏనాడూ ఆసుపత్రికి పోవాలని అనుకోలేదు. ఈసారీ అదే ధీమాతో వుంది.

తన కాళ్ళు కళ్లూ వాచేవరకూ బెనారస్‌లోనే పురుడు పోసుకోవాలనుకొంది.

అయినా ఏం బుద్ధి పుట్టిందో నెల్లూరికి వచ్చేసింది.

వర్షం ఎక్కువవుతోంది. ఉరుములు.

---

1. వాడిపోయిందో 2. పసిపిల్లలకు సంధి నెలలలో వచ్చే జబ్బును అరికట్టే ఆకు

నగ్మా తేలిపోతోన్న కళ్ళను పెద్దవిచేసి ఆకాశాన్ని వింతగా చూసింది. సుజి, దబాబాయి, నగ్మా టౌనుబస్సు దిగి రోడ్డుకడ్డం పడ్డారు.

నక్కలోళ్ళ ఎనభైయ్యారు ఇళ్ళు వానలో నాని వింత వాసన వస్తున్నాయి. పెద్దగాలీవాన వచ్చినపుడు పట్టాలిచ్చారు. మళ్ళీ పెద్దా చిన్నో గాలీవానలు రెండెళ్ళాక వాళ్ళకు గూళ్ళు అమిరాయి.

నిజానికి దబాబాయి ఆఫీసర్ల లిస్టులోకి ఎక్కేదే కాదు నెల్లనేరం కలుగజేసుకోకపోతే.

అందరి పేర్లు నమోదు చేసుకునేటపుడు మంగుళూరు సింగు పేరు ముందే రాయించుకున్నాడు.

జలకన్నితో సహా నెల్లనేరం కల్పించుకున్నాడు.

"ఆ యమ్మి ఇంటాయన[1] సచ్చాడు.... షికారు[2]కు పోయి..."

దబాబాయి నెల్లనేరానికి అడ్డుపడబోయి తమాయించుకుంది.

ఏమైనా ఓ గూడు అమిరింది.

జలకన్ని మొగుడితోపాటు ఇద్దరు పిల్లల తల్లయ్యాక తిరిగివచ్చింది. ఇద్దరూ ఆడపిల్లలు.

దబాబాయి కడుపు మండిపోయింది. దబాబాయి కూతురు తడాబాయిని ఏదో వూళ్ళో రెండు వందల రుపాయలకు ఎవరికో ముడిపెట్టేసి వచ్చారట.

దబాబాయి గుండె పగిలిపోయింది.

నెల్లనేరం, మంగళూరు సింగు ఇచ్చిన డబ్బులు పుచ్చుకొని "బిరాంది"[3] తాగేసి వాటిష్టం వచ్చినట్టు వాడు చేసుకోవచ్చు పొమ్మన్నాడు.

పంచాయితీ తీర్మానం అలా ముగిసింది.

పైనుంచి జలకన్నీ మొగుడితో ఖరాఖండిగా చెప్పేసింది.

దబాబాయిని దగ్గరకు రానిస్తే ఇద్దరు కూతుళ్ళతోపాటు వెళ్ళిపోతానని. ఇద్దరు కూతుళ్ళంటే సామాన్యమా? మంగుళూరుసింగు పిల్లైపోయాడు.

దబాబాయి జీవితంలో కూతురిని తిరిగి చూడలేదు.

అంతే–

దబాబాయి ఒంటరిదైపోయింది. గుంపులో గోవిందంలా.

అయినా తన అట్టే తనకు అండ అని దబాబాయి నమ్ముతోంది.

దబాబాయి ఆ రాత్రి బెనారసుకు బయలుదేరుతూ మళ్ళీ మనవరాలితో చెప్పింది.

"అమ్మీ... అట్ట ఎత్తి మూలన పెట్టేసినావు. అనుబగంతో చెప్పేది ఇంతూ వుండాలి తల్లే – మన్మూ యాపారం చేత్తాం తల్లే – కడుపు నిండాలే కాదు తల్లే – అట్ట ఇడిసినావో ఆపతి[4] వొచ్చాది – యాపారం చేయ్యాలి అమ్మీ..." దబాబాయి మళ్ళీ అంది. "ఆచ్పుత్రిలో పురుడు చేచుకో – నేను వచ్చాను[5]–"

"అట్నే పోయే అవ్వా..." సుజీ తెలిగ్గా అనేసింది.

---

1. భర్త 2. వేట 3. బ్రాంది 4. ఆపద 5. వెళ్ళివస్తాను

అననైతే అనింది కానీ, సుజీ అట్ల తీసుకోలేదు. ఆసుపత్రికి పోలేదు. ఆ రాత్రే సుజి తల్లి పంచన చేరింది.

రంగుల రంగుల కాగితాల్ని కత్తిరిస్తూ - పూలరేకుల్లా మడుస్తూ - పూలలాచుడుతూ - పూలచెట్లలా అమరుస్తూ - ఇంట్లోనే వుంది.

కలో గంజో తల్లిదండ్రులు పెట్టేది తింటోంది.

కదిలితే ఆయాసం.

రాత్రికి గాలీవానా ఎక్కువయింది.

సుజికి ఆయాసం ఎక్కువయింది. ఊపిరి ఆడనంతగా

నక్కలోళ్ళంతా సుజీ చుట్టూ చేరారు. ఊరు కాని ఊరు - ఊరు అవతల ఊరు.

టేసనుసింగు పడుతూ లేస్తూ వెళ్ళి ఆటో పిలుచుకువచ్చాడు.

ఆదరాబాదరగా అందరూ సుజిని ఆసుపత్రికి తీసికెళ్ళారు.

డాక్టరమ్మ పరీక్ష చేసి సుజికి బిపి వచ్చిందని చెప్పింది.

తల్లి ప్రాణానికే ప్రమాదంగా వుందని ఆసుపత్రిలో చేర్పించేసింది.

నక్కలోళ్ళంతా గొల్లుమన్నారు.

సుజి గింజుకుంటున్నా వినకుండా బెడ్ ఎక్కించేసారు.

మూడు పూట్లా మందు బిళ్ళలు మింగించారు నర్సమ్మలు.

సూదులేవీ లేకపోవడంతో సుజి శాంతించింది. వార్డులోనే కొందరు నొప్పులుపడుతోంటే - పసిపిల్లలతో కొందరు కిందామీదా పడుతున్నారు.

ఆ పూట అన్నం తింటూంటే పక్కమంచం ఆవిడ కుతూహలంగా అడిగింది.

"ఏం కూర?"

"ఉడుం ఏపుడు" సుజి తాపీగా అంది

పక్క మంచం ఆమె భళ్ళున వాంతి చేసుకుంది.

సుజి భుజాలెగరేసి పగలబడి నవ్వింది.

డాక్టరమ్మ వచ్చిరాగానే బిపి చూసింది.

చేతికి గుడ్డ చుట్టి గాలి వూదడం సుజికి సరదాగా వుంది. ఆమె ఆ ఉత్సాహంలో వుండగానే డాక్టరమ్మ సుజిని థియేటర్‌లోకి తీసుకెళ్ళింది. సుజికి మత్తు తెలిసేసరికి వళ్ళంతా చురుకులు మంటలు. పొట్టంతా కోతలు. బ్యార్‌మంది

"గమ్మునుండు[1]" కసిరింది నర్సమ్మ

"బిడ్డ..." సుజి మాట్లాడడానికి కూడా భయపడుతూ గొణికింది.

"పెట్టిలో[2] పెట్టుండ్లా... ఓ రోజో రెండ్రోజులో కాబళ్ళా... బిడ్డ బతకద్దో సచ్చద్దో..."

1. మాట్లాడకు 2. ఇంక్యుబేటర్

నెల్లూరుబాయి అటూ ఇటూ చూసి సుజి నోట్లో సారా తెచ్చిపోయాలని చూసింది.

సుజి తల్లివంక ఆత్రంగా చూసింది. ఐదుసార్లు కానుపులైనా నొప్పి తెలియకుండా మత్తులో పడిఉండేది. ఇపుడు వళ్ళంతా కుళ్ళబొడిచినట్లుంది.

నర్సమ్మ నెల్లూరుబాయి చేతిలోని సీసా లాక్కొని బయటకు పడేసింది.

"చవురా[1]తున్నానమ్మే...." నెల్లూరుబాయి బతిమిలాడింది.

"చవుర్లేదు గవుర్లేదు.. నీ అలవరేషాలు[2] డాక్టరమ్మకు తెలిస్తే మా ఉద్యోగం ఊడుద్ది. పద.. పద.. విజిటింగ్ అవర్స్... అయిపోయాయి..." నెల్లూరుబాయిని తోసినంత పనిచేసింది నర్సమ్మ.

"ఈళ్ళతో పనిగాదు..[3]!" నర్సు నుదుటి మీద చిన్నగా బాదుకుంటూ గొణుక్కుంది.

"ఏం జరిగింది?" డాక్టరమ్మ కుతూహలంగా అడిగింది.

ఉడుం వేపుడు నుండి జరిగిందంతా చెప్పింది. "నక్కలైతే మహాయిష్టంగా తింటారట... యాక్"

"అలా అసహ్యించుకోవద్దు పాపం ఏం చేస్తారు? తినడానికి ఏదైతేనేం కడుపునిండాలిగా..."

"అంత జాలిపడకండి డాక్టరుగారూ... వీళ్ళకేం రోగం? రోజంతా అమ్మకాలు... అడుక్కోవడాలు.. సాయంకాలమైతే తాగుడు. రెండో ఆట ఏ సినిమాహాల్లో చూసిన వాళ్ళే... ఆ పాటలు... ఆ చిందులు.. అప్పుడు చూడాలి... వంటి మీద గుడ్డలు తీసేసి గోచీల్తో ఎగురుతారు... ఛీఛీ.."

"వాళ్ళ ఆటలుపాటలు చూసి ఆనందంగా వున్నారన్న నిర్ణయానికి వచ్చేయద్దు. ఆషామాషీగా కన్పించే ఆ జీవితాల్లో చాలా విషాదం వుంది చూడు... ఆ సుజి... నిండా ఇరవైఏళ్ళన్నా వున్నాయో లేదో... అపుడే ఆరు కానుపులు... అందులో ఇప్పటికి నలుగురు బిడ్డలు పోయారు. పెద్దపిల్ల ఎదుగుబొదుగూ లేకుండా ఎలా వుందో... ఆహారమే లేదు. పౌష్టికాహారం గురించి ఎలా చెప్పాలి? అయ్యో..." డాక్టరమ్మ బాధగా అంది.

"ఊరుకోండి డాక్టరుగారూ... మీరు మరీను... ఆళ్ళని చూసి జాలిపడ్డారంటే అంతే సంగతులు. చూస్తూ చూస్తూ కంట్లో పాపని కంట్లోనే కత్తిరించేయగలరు. నిన్నటికి నిన్న ఐదువందల రూపాయల నోటు తీసుకొని మెడికల్ షాపుకి వెళ్ళిందట సుజి తల్లి "గుల్కోజు పొట్టం" కావాలని. గ్లూకోజ్ ఇచ్చి చిల్లర ఇస్తే తీసుకున్నట్టే తీసుకుని రెండు వందలు మాయం చేసి – ఎరగనట్టు – సామే... రెండొందలు తగ్గినాయి" అని వాడితో తగవుకి దిగిందట. అమ్మో... నక్కలోళ్ళతో పనిగాదు[3]... వాళ్ళ ఆగిత్యం[4] భరించలేక మెడికల్‌షాపువాడు డబ్బుకట్టాడు. గ్లూకోజు ఇచ్చాడు". నర్సమ్మ గుండెలు బాదుకుంది.

డాక్టరమ్మ పకపక నవ్వేసింది. నవ్వాపి గంభీరంగా అంది.

"బతుకు తెరువుకోసమేగా ఈ జిత్తులమారి పనులు? వాళ్ళమీద రికార్డెడ్ క్రైం ఏవీ లేదు తెలుసా? తాగుడు... అవును.... అది వాళ్ళకు మామూలు అలవాటేమో కానీ పిల్లలను కూడా.... హు... వాళ్ళు తాగడానికి ఖర్చుపెట్టిన దానిలో సగమైనా తిండిమీద పెడితే ఇన్ని శిశు మరణాలు – ఇంతటి అనారోగ్యం వుంటుందా?" డాక్టరమ్మ బాధగా అంది.

---

1. కొబ్బరినూనె 2. పెకిలివేషాలు – పోకిరివేషాలు 3. నెల్లూరీయుల ఊతపదం 4. గొడవ

"వాళ్ళ తిండి వాళ్ళు సంపాదించుకోగలరు. కనీస ఆరోగ్యం, కనీస పరిజ్ఞానం వాళ్ళకి కావాలికదా.. వాళ్ళూ ఓటర్లే ఏం లాభం? వాళ్ళ జీవితాలు ఎవరికి పట్టాయి? పేదవాళ్ళు... కటిక పేదవాళ్ళు..."

నర్స్ మౌనంగా తలాడించింది.

"ఆ నెలల తక్కువ బిడ్డను బతికించాలి. తరువాత సుజికి ఆపరేషన్ చేయాలి పిల్లలు పుట్టకుండా.." డాక్టరమ్మ ఉద్వేగంగా చెపుతూనే వుంది.

"మనం చెపితే వాళ్ళు వినరా? ఏదో మారుమూల పల్లెల్లో వుంటే అనుకోవచ్చు. మన మధ్యే ఉంటూ.."

నర్సమ్మ తన అనుభవంలో ఇలాంటి ఆవేశపడే డాక్టరమ్మలను చాలామందినే చూసింది. అప్పుడే ఏవుందీ? పూనుకుంటే కదా అసలు సంగతి తెలిసేది!

అందుకే ఆవిడ అన్నదానికన్నిటికి తలూపింది. 'వింటే బాగానే వుంటుంది. కానీ పుట్టి బుద్దెరిగినప్పటి నుంచీ చూస్తుండ్లా... నక్కలోళ్ళు అప్పుడెలా వుండారో ఇప్పుడు అట్లాగే వున్నారు. ఏందీ వాళ్ళు బాగుపడేది. ఈళ్ళు బాగుచేసేది? అయినట్టే...' త్వరలో రిటైరవ్వబోతోన్న నర్సమ్మ నిట్టూర్చింది.

నక్కలోళ్ళంతా కీసరబాసరగా అరుచుకుంటూ గేటు దగ్గరే పడివున్నారు.

నక్కలోళ్ళంతా తలావందో రెండొందలో చేబదులు ఇచ్చి టేసన్‌సింగును ఆదుకున్నారు. అందుకే డాక్టరుతో ధీమాగా చెప్పాడు టేసన్‌సింగు.

"డాక్టరమ్మా... ఎంతయినా కానీ తల్లే... మోటుకుంటా[1]... బుడ్డోడు.. బతకాల..."

సుజికి ఇంక్యుబేటర్‌లో కొడుకుని చూసి తల తిరిగిపోయింది.

అరచేయిలో ఇమిడేంత బిడ్డ. ముక్కుకి నోట్లో ట్యూబులు, చేతికి సెలైన్.

నర్సమ్మలు పాలిమ్మన్నపుడు ఇస్తూ ఆసుపత్రి మెట్లమీదే పడి వుంటోంది.

నెల్లూరుబాయి ముప్పూటలా ఇంత ముద్ద తెచ్చిపెడుతోంది. నగ్మాని చూసుకోమని కొడుకుని ఇంటికి పంపేసరికి కేజీన్నర బరువుతూగాడు.

"ఇదో అమ్మా... మా పిల్లాడిని మీ చేతికిస్తున్నాము. వాడికి తాగించి చెడీబడీ తినబెట్టి ప్రాణం మీదికి తెచ్చావంటే ఊరుకొనేది లేదు"– డాక్టరమ్మ నవ్వుతూ సుజిని హెచ్చరించింది.

సుజి బిడ్డను చూసుకుంటూ వ్యాపారానికే వెళ్ళలేదు. అడుక్కోవడానికీ వెళ్ళలేదు. నెల్లూరుబాయి టేసనుసింగులు పెట్టింది తింటోంది. నగ్మాకి భేదులయ్యి తగ్గింది. అపుడు తిరిగి వచ్చారు. దబాబాయి, కావల్‌కార్ వాళ్ళ లెక్కప్రకారం సుజి ఇపుడు పురుడు పోసుకోవాలి. వీళ్ళు ఇంటికి వెళ్ళేసరికి పిల్లాడిని వుంజాల[2]లో వేసుకుని పూలచెట్లు తయారు చేస్తుంది సుజి. విషయమంతా చెప్పాక టేసన్‌సింగు నింపాదిగా అన్నాడు.

"ఖరుచులన్నీ కట్టి నీ ఆలుబిడ్డలను తోడ్కొపో..."

---

1. ఎదుర్కొంటా 2. పిల్లల్ని మోయడానికి తల్లి కట్టుకొనే జోలె

"ఖరుచా... ఏంది మావో..."

"పదేలు[1]..."

"పదేలా?" కావల్‌కార్ గుడ్లు తేలేసాడు.

"నీ బిడ్డ నగ్మాకు రెండువేలు, పుట్టినోడికి, సుజికి ఎనిమిదేలు..." కావల్‌కార్ గుండెలు బేజారయ్యాయి.

సుజితో మాట్లాడాలని చూసాడు.

"నీ ఆలుబిడ్డ కావాలంటే నా నాయనకి డబ్బులు కత్తు. మా నాయన కాడ డబ్బులు యాడకెల్లి వచ్చినాయి? తండల[2] కిచ్చిన నక్కలోళ్ళంతా గమ్ముగుంతరా[3]? ఇల్లు వాకిలి పెరుక్కుంతరు[4]!"

దబాబాయికి మనుమరాలి వ్యవహారంతో వళ్ళు మండిపోయింది.

"దాని కంతా కీతాగా[5] వుండాదే... మల్లాగుల్లాలు[6] ఎందుక్కపడ్తావ్? దాని ఎదాన డబ్బులు ఇసిరి రా–" తిట్టిపోసింది కొడుకుని.

కావల్‌కార్ దగ్గర మూడువేలున్నాయి. మళ్ళీ వ్యాపారానికి పెట్టుబడికి.

రెండువేలిచ్చి కూతుర్ని తెచ్చుకున్నాడు. సుజి బెట్టు చేసింది రానని.

అప్పటినుంచీ వాడికి సుజిమీద వళ్ళు మంటగా వుంది.

"సుజి ఎక్డ?" దబాబాయి అడిగింది.

"మన్కీ ఎందుక్క? పిల్లోన్ని చూపెట్టి చేతిలో బిడ్డను పెరుక్కోని పోయినారు. రెండు వేలిస్తే నగ్మాను ఎత్తిచ్చేసినారు. దాన్కి కాప్రం ఎందుక్క? మొగ్డు ఎందుక్క?" వాడు నగ్మాను దబాబాయి వళ్ళో పడేసి విసురుగా వెళ్ళాడు.

కావల్‌కార్ తల్లివళ్ళో నగ్మాను పడేసి తిన్నగా సారాకొట్టుకుపోయాడు.

ఎతిరాజా ఎదురుపడ్డాడు.

తన కోపంతో అంతా వెళ్ళగక్కేసాడు కావల్‌కార్.

ఎతిరాజాకి ఆనందంగా వుంది.

తండ్రికి చెప్పి పంచాయితీ పెట్టించాడు.

"మా ఇంటాయన నేనూ నాల్గు మాతలు[7] అనుకుంతం. కల్బుకుంతం. మీరెవరు నడమ తీరుమానం[8] చెప్పనానికి? నగ్మాను పెరుక్కొని[9] పోయినాడు. నామీద పసోడిమీద ఆస వుంతే మా నాయనకు డబ్బులు కట్టి తీస్కపోమను.

మానాయిన డబ్బులు ఖరుచుపెట్టింది. మా మందులు మిందులు గుల్కోజు మిల్కోజు మింద కాదా? ఆళ్ళు పోయి సుద్దంగా[10] బెనారసులో యాపారం చేత్తే మా అమ్మానాయిన కాదా నా పాణాలు పోసింది. పో... పో... నా సామే..." సుజి ఒక్క దులుపు దులిపేసి పంచాయితీలోంచి చక్కా లేచివెళ్ళిపోయింది.

---

1. పదివేలు 2. వడ్డీలు 3. ఊరుకుంటూ 4. లాక్కుంటారు 5. నవ్వులాటగా వేళాకోళంగా 6. తర్జనభర్జన 7. మాటలు 8. తీర్మానం 9. లాక్కుని 10. శుభ్రంగా

కావల్‌కార్‌కి దిమ్మతిరిగిపోయింది సుజి తిరుగుబాటుకి.

పెద్దలంతా తెల్లమొహం వేసారు. నక్కలోళ్ళంతా వెర్రిమొహం వేసారు.

టేసన్‌సింగు తాపీగా కూర్చున్నాడు. ఏమీ ఎరగని వాడికిలాగా.

నెల్లూరుబాయి అలాగే కూర్చుంది. వక్కాకు నములుతూ

కూతురి వెనకాలే అంతే ధీమాగా ఒక్కోళ్ళు లేచివెళ్ళారు. నెల్లూరి బాయి టేసన్‌సింగు.

కావల్‌కార్ పళ్ళు పటపట కొరికాడు.

ఎతిరాజా వాడిభుజాన చెయ్యేసి నెమ్మదిగా అన్నాడు.

"ఆడుమనిచి ఆడుమనిచి తీర్న[1] వుండాల్రా... కావల్... సెప్పు తీసుకోని నాలుగు అంటీబళ్ళా[2]... నా మాటిని దాన్ని లేపి లేపి తన్ను... అప్పుడింటాది నీ మాట..."

కావల్‌కార్ కోపంగా లేచి వెళ్ళిపోయాడు.

దబాబాయి జరుగుతోన్న దాన్నంతా నిర్లిప్తంగా చూస్తోంది.

సుజి అంటే మురిపమే మనవరాలని. కోడలు కాగానే కొమ్ములు మొలిచాయేమో కొరకరాని కొయ్యై కూర్చుంది.

వచ్చీ రాగానే మొగుణ్ణి కొంగునేసుకుని ముడేసుకుంది. ఆమె చక్కదనం అట్లాంటిది. ఎతిరాజా ఇప్పటికీ సుజిని చూసి తలతిప్పుకోలేదు.

నక్కలోళ్ళల్లో పుట్టాల్సింది కాదు. సంసారీల్లో పుట్టాల్సింది.

పుటకే కాదు సుజి సంసారీల పోకడలు కూడా పోవాలంటుంది.

అక్కడే దబాబాయికి సుజి మీద వళ్ళు మంట.

కావల్‌కార్ ఒకమాటన్నా పడివుండాడు. సుజి యింతెత్తున లేస్తుంది.

"మన్కీ ఎంద్కూ ఇల్లూమిల్లు? ఇల్లొచ్చింది ఆపతి వొచ్చింది – ఇంతిలో చేరి మొగుణ్ణి ఈదిలోకి తరిమింది. ఆడు తెత్తే ఇది వొండి పెడ్తాదంత! పెత్తరేషాలు[3]! సంపాదించినోడు ఊకుంతాడా? నాలుగు పీకుతాడు. మొత్తుకుంటది. మళ్ళీ బతిమిలాడతాడు. మన్కీ ఎంద్కూ ఇదీ? నక్కలోల్ల ఆడుమనిచి అట్ట తీసుకోపోకుండా ఇంతిలో దూరిందే ఆపతి వొచ్చింది..."

"అవ్వో... నువ్వు గమ్మిగుండు సంసారోల్లను సూడు.. పెండ్లాం వొంటామింటా చేత్తే ఇంటాయన తెచ్చి పెడ్తుళ్ళా..."

"ఓయమ్మీ.. వొచ్చిపడ్డాది సంసారీల నాగరీకం! తన్నిచ్చుకోమ్మే... తన్నిచ్చుకో..."

"ఇంటాయన ఒక మాత అంతే పడ్తం. అవుసరం అయితే మాత అంతం. ఒక్క దెబ్బ తింతం–"

సుజి అవ్వ మాటల్ని తిసేసింది.

"ఈణ్ణే వుంతాలే నేనాడికి బోతావున్నా... చూడబళ్ళా మారాణిగారి వైభోగం! చిగ్గులేని దానా... నక్కలోళ్ళమ్మివి... తప్పుడు మాతలు కూయకమ్మీ... అట్ట తీచుకో... ఆపతిపోతేది..."

---

1. తీరుగా 2. అంటించక్కెర లేదా ? 3. తలబిరుసుపనులు

"ఆపతి లేదు... సోపతి లేదు... అట్టా బళ్ళేదు... తట్టా బళ్ళేదు[1]... గమ్ముగుండే అవ్వా.." సుజి తేలిగ్గా కొట్టి పారేసింది.

దబాబాయి మనవరాలి విరగబాటుకు వళ్ళు మండినా వీలున్నపుడల్లా పోరుతూనే వుంది.

సుజి అక్కడికి ఆగితే దబాబాయికి దిగుల్లేదు.

కావల్‌కార్‌ని నేర్చుకోవాలన్న తాపత్రయంలో రిక్షాను తీసుకెళ్ళి గోడకు గుద్ది మోకాళ్ళు బద్దలు కొట్టుకొన్నాడు.

దబాబాయి లబలబలాడుతూ ఇద్దర్నీ నెల్లనేరం దగ్గరకు లాక్కెళ్ళింది.

నెల్లనేరం మొగుడూ పెళ్ళాలను చీవాట్లు పెట్టాడు.

"ఏమైందీ అవ్వా మన్కి దేవుత వుండ్లా.. ఆవంతన రచ్చేం చేయబళ్ళా..." సుజి నెల్లనేరంని. ఎగతాళి పట్టించడానికి దేవుడి మాట ఎత్తింది.

నెల్లనేరం అవసరమైనపుడు పూనకం తెప్పించేసుకోని దేవుడి అవతారం ఎత్తేస్తుంటాడు.

"ఆ దేవతే వుంటే నా సైతి[2]ని తెచ్చి పెట్టేనా? ఆ దేవుతే వుంటే నీ కడుపు నల్లగా సూడదా?" దబాబాయి మెటికలు విరిచింది.

నెల్లనేరం గొంతు సవరించుకొని మాటలు పేర్చుకొని గంభీరంగా అన్నాడు కావల్‌కార్‌తో.

"మన్కీ దేవత వుంటే అంతా ఒకేసారి వుంతయ్యా... దేముడు ఒక తడవ వుంతడు. ఒక తడువ లాకుండా. ఆయుసీణం అయిపోతావుంతది అబ్బయ్యా... నువ్వు దాని మాత ఇంతున్నావు. ఆడుమనిచి మగమనిచి మాట ఇనుకోవాల. నక్కలోనివి నక్కలోని తీరున వుండు బద్దరం రేయ్..."

కావల్‌కార్ మళ్ళీ రిక్షా తొక్కే సాహసం చేయలేదు కానీ సుజి కూలికెళ్ళమని ప్రోత్సహించింది. వాడి అవతారం చూసి ఎవరూ కూలికి పిలవలేదు. కనకమహాల్ సెంటర్‌లో నిల్చోని నిల్చోని కాళ్ళుపీకి మొగుడు పెళ్ళాం ఇద్దరూ ఇంటి మొహం పట్టారు.

అపుడే సుజి మొగుడి వెంట్రుకలు కత్తిరించేసింది. ఎగుడుదిగుడుగా వున్నా తెలుగు సినిమా హీరోగారి కటింగు వచ్చేసింది.

మొగుణ్ణి చూసి సుజి కితకితలాడింది.

"సిరంజీ[3]..." వెక్కిరిస్తూ వేళాకోళాలాడుతూ పకపకమంది.

"ఓరబ్బయ్యో..." దబాభాయి గుండెలు బాదుకుంది. దబాబాయి ఈడువాళ్ళల్లో ఒకడు ఇలాగే వెంట్రుకలు కత్తిరించుకుంటే జాతిలో కలవనీయలేదు. ఇప్పటికీ వీడికిదేం పొయ్యేకాలం?

కావల్‌కార్ తలగ్గిరున తిరిగి వచ్చింది.

హీరోగారి మైకం చప్పున దిగిపోయింది.

బిత్తరపోయి గుంపుకట్టిన నక్కలోళ్ళ వంక భయంభయంగా చూసాడు.

"చెప్పు తీచుకోని తన్నబళ్ళా ఎదవనీ... నక్కలోడివి... ఎంటికలు కాపింగు చేచేవా? పోయి

---

1. అట్ట అవసరం లేదు 2. సవతి 3. చిరంజీవి

పెన్నులో దూకరా... తప్పుడు నాయాల... పుడింగి...." నెల్లనేరం ఊగిపోయాడు. కావల్‌కార్ అందరి మధ్యా దోషిలా కూలబడ్డాడు వణికిపోతూ.

"ఉ...ఊ...ఊ...ఊ...ఊ...ఓ...ఓ..."

దబాబాయి ముందుకీ వెనక్కీ వూగుతూ దబ్బున విరుచుకుపడింది.

నక్కలోళ్ళంతా సలాములు పెడుతూ పాడడం మొదలెట్టారు.

"ఒడియావే... ఒడియావే...

లిల్లిల్లా... లిల్లిల్లా...

ఏం... బోంగ్దామారియల్ [1]...

లిల్లిల్లా.... లిల్లిల్లా...." [2]

వాళ్ళు పాడుతున్న కొద్దీ దబాబాయి ఊగుతోంది.

దబాబాయి ఊగుతోన్న కొద్దీ వాళ్ళు నేలకంటి సలాములు పెడుతున్నారు.

అందరూ సలాములు పెడుతూనే చెవులు రిక్కించారు దేవత మాటలు వినడానికి.

దబాబాయి అందరినీ విదుల్చుకొని పైకి లేచింది.

"ఊ...ఊ...ఊ... ఓరి... నక్కలోడా.... పోరా... వూరిడిసిపో... వుత్తరం తట్టుపో... ఊరుగిరావతమ్మ[3]కు మేకల్ని ఇచ్చిపోరా... ఓ... బోంగ్దావాలే[4].... ఊ... ఊ..."

దబాబాయి మాటామంతి లేకుండా వెనక్కు విరుచుకుపడింది.

కావల్‌కార్ బతుకుజీవుడా అనుకుంటూ అందరికి సారాపాకెట్లు తెచ్చిచ్చాడు. రాత్రి బండికి ఉత్తరం వెళ్ళిపోయాడు సుజితోపాటే.

వెళ్ళబోయే ముందు సుజి దగ్గరికి రహస్యంగా వెళ్ళింది దబాబాయి.

"ఆ మాదిరిగా వుంతే నక్కలోళ్ళని యాడికి రాబళ్ళేదంతున్నారు. మన్కీ దుడ్లు మిడ్లు లేవా.... వోటలుకి పోయి ఇట్ట ప్రకారం తిండిమిండి తినబళ్ళేదా? చిన్మాగిన్మా పోబళ్ళేదా..?" సుజి విరుచుకు పడింది అవ్వమీద.

"సుద్దంగా[5] వుంటే కానీ పాపమా? యాందవ్వో..."

"నువ్వేం పెత్తరి పన్లు సేయబళ్ళా... ఎంటికలు పెరిగిందే ఆలిస్సం.. బిన్నా[5] వచ్చేయమ్మే..."

మళ్ళీ పూలచెట్లు వ్యాపారంలోకి దిగాడు కావల్‌కార్ బుద్ధిగా.

సంసారోల్ల మాదిరి మొగుడితో తన్నులు మాత్రం తింటూ వుంది అప్పుడప్పుడూ.

దబాబాయి నిట్టూర్చింది. ఆమెకు కూతురు అల్లుడిమీద కోపం లేదు. పాపం వాళ్ళు మాత్రం ఎక్కడ తెచ్చి కడతారు వడ్డీలు?

నగ్మాను చంకనేసుకొని సుజి దగ్గరికి వెళ్ళింది. నగ్మా సుజి దగ్గరికి పరిగెత్తింది. ధోలీలోంచి కన్పిస్తున్న తమ్ముడి పాదాల్ని ముట్టుకోవాలని ప్రయత్నిస్తోంది.

---

1. మేకల్ని బలిచ్చే జాతి దేవత 2. దేవతను ఆవాహనచేసే పాట 3. నక్కలోళ్ళదేవత 4. మేకల్ని బలిచ్చే జాతి 5. శుభ్రంగా 6. వెంటనే

"అట్ట తీచుకో... అమ్మకానికి పో... ఆపతి పోతాది. మీ నాయనకి కొరవ[1]సొమ్ము ఆలుమగలు తీరిచేయండి. సూడమ్మే... నగమా ఆ వంతన ఏడుత్తుళ్ళా.... ఎందుకమ్మే.. కాప్రం[2] ఆగం[3] చేసుకుంటుండావ్–"

"పోయే... అవ్వా... నువ్వేం చెప్పబళ్ళేదు." కసిరింది సుజి.

"ఆ మిడియాలం[4] చూస్నా...." దబాబాయి తిట్టుకుంటూపోయింది. నగ్మా దబాబాయి వెనక పరిగెత్తింది.

సుజి ఆస్పత్రితోనే ఆపతి వచ్చిందనుకుంటోంది.

ఆ డాక్టరమ్మ ఏం బిళ్ళలు ఇచ్చిందో ఏం మాయ చేసిందో నోట్లో సాంగ్యానికి[5] కూడా చుక్క సారా పోసుకోలేదు.

ఇంట్లో కూచోని మూడుపూటలా కడుపుకింత తింటోంది.

తండ్రి బిరాండీ తెచ్చిచ్చినా తాగలేకపోయింది.

తెల్లగడ్డ మిరపకాయ చింతపండుతో ఇంత ముద్ద తిని పత్యం చేస్తోంది.

నోరు చెడిపోయింది. బుర్రమాత్రం చక్కగా పనిచేస్తోంది.

సుజి కావల్‌కార్ తనని బతిమలాడడానికి వస్తాడనుకుంది. లేదు. అతను రానేలేదు.

కానీ ఎతిరాజాతో తిరుగుతున్నాడు రాత్రింబవళ్ళు. ఇది సుజికి నచ్చడం లేదు. వళ్ళు మండిపోతోంది. "ఈడి పోడు[6] ఎక్కువై పోతోంది." కచ్చిగా గొణుక్కుంది.

సుజి ఆలోచించి ఆలోచించి అవ్వమాటే సరైందనుకుంది.

"అవును... ఆలుమగలు కల్చిపోతే నాయనకి డబ్బులు ఇయ్యచ్చు కాదా?" కావల్‌కార్‌ని వెతుకుతూ బయలుదేరింది.

ఏ వేటకు వెళ్ళాడో... ఏ వ్యాపారానికి వెళ్ళాడో...

మొదటి ఆట వదిలే వేళకి రైలుకట్ట కింది గానుగచెట్టు దగ్గర కనపడ్డాడు.

పక్కనే ఎతిరాజా ఏవో మాట్లాడుకుంటున్నారు.

సుజి మురుక్కాలువలో కాలేయబోయి తమాయించుకుంది.

"ఎదవ నాయాల.. మా ఇంటాయన దొరికినాడా యవ్వారాలు సెప్పుకోను..."

సుజి ముందుకెళ్ళాలో వెనక్కెళ్ళాలో నిర్ణయించుకోలేక చీకట్లో నిలబడిపోయింది.

"ఛా... సీకటీగ[7]..." చేతి మీద వాలిన దోమను టపామని కొట్టాడు కావల్‌కార్.

"హ్హా... హ్హా... హ్హా." ఎతిరాజా నవ్వాడు.

"ఆడుమనిచిని కూడా ఆ మాదిరిగా అదనుబళ్ళా ఎదవా...."

కావల్‌కార్ ఉక్రోషంగా తలవిదిలించాడు.

"నా మాత ఇంతా వుండు. పదేనేలు ఇత్తా... పది ఆ టేసన్‌సింగుగాడి ఎదానకొట్టు.

---

1. మిగిలిన 2. కాపురం 3. పాడు 4. తలబిరుసు 5.సంప్రదాయం 6. గొడవ 7. దోమ

ఐదు నువ్వెత్తి పెట్కో…"

కావల్‌కార్ ఏమీ మాట్లాడలేదు.

సుజి ఊపిరి బిగబెట్టింది 'పదేనేలా? ఏవిటికి ఇత్తున్నాడు?'

ఎతిరాజా తూలుతూ పైకి లేచాడు. అడ్డపంచ విప్పి కిందపడేసాడు.

లోపల వేసుకున్న పొడవాటి లాగూలోంచి డబ్బులు కట్టదీసి కావల్‌కార్ ముందుకు చాచాడు.

"ఏకోజామున[1] సుజిని సైగ్గా[2] బండి ఎక్కి-మదరాసు ఎల్లిపోతాం- ఇయిగో పదేనేలు-"

కావల్‌కార్ ఒక్కక్షణం ఆగాడు. తలపైకెత్తి ఎతిరాజా చేతిలోని డబ్బుని తటపటాయిస్తూ తీసుకొన్నాడు. తన పైజామా జేబుల్లో గబగబ కుక్కుకున్నాడు.

"మన ఇళ్ళ పట్టాలు ఆ వోటలాయన పేరు చేయాలా… మళ్ళా ఓట్లపండుగాళకి అన్నీ సద్దుమణగాల – ఈ నక్కలోళ్ళ గుడిసెలన్నీ అంగళ్ళయి పోతాయో – యాందో – ఒరేయ్ – మళ్ళా మాట మార్చేవురోయ్ కావల్‌కార్…! అసలే ఆ సామి ఎల్లచ్చున్ల పోటీ పడబోతాడు –"

"సత్తెం" ఒట్టుపెట్టుకుంటున్నాడు. "ఆ అనుమానవే బళ్ళా …"

సుజి శబ్దం కాకుండా వెనక్కి తిరిగింది.

"నక్కలోళ్ళకు ఏవీ ఉపద్రం? యాడికిపోవాలా – ఈ ఇల్లిడిచి ఆ ఎతిరాజాకి ఇల్లిచ్చి.. ఇల్లాలినిచ్చి –" సుజి ఆలోచనలు సాగలేదు.

సుజి కళ్ళ ముందు తన బుజ్జి పెంపుడు ఉడుత కదిలింది – దానిలో లోపలికి తొలిచి… మాంసం అంతా వలిచి… గడ్డికూరి… చేతిలో పెట్టిన ఎతిరాజా…

సుజి కడుపులో దేవినట్లయింది. వుంజాలలో బిడ్డ కదిలాడు.

సుజి తిన్నగా దబాబాయి దగ్గరకి వెళ్ళింది.

దబాబాయి పక్కన నేలమీద అడ్డంగా పడివున్న కూతుర్ని పైకి ఎత్తుకుంది. మూటల పక్కన వున్న దబాబాయి పూసల అట్టను తీసుకుంది.

రైలు కట్టకు అడ్డంగా పడి స్టేషన్‌కు చేరిపోయింది.

అర్థరాత్రి బండిలో ఎటో వెళ్ళిపోయింది.

ఏకఝామున లేచి దబాబాయి పక్కలో నగ్మా లేకపోవడంతో గొల్లుమంది. టేసన్‌సింగు, నెల్లూరుబాయి తలబాదుకున్నారు. కావల్‌కార్ పెళ్ళాం బిడ్డలు లేకపోవడంతో గోడుగోడున ఏడ్చాడు.

పూసలట్ట లేకపోవడం చూసి దబాబాయి సంతోషించింది.

"పూసలోయ్… దబ్బనాలోయ్… పిన్నులోయ్…" ఎక్కడో సుజి అరుస్తూనే వుంటుంది.

నగ్మా ఆమెతో గొంతు కలిపేదాకా.

వంటరిగా.

---

1. తెల్లవారుఝామున 2. రహస్యంగా